క్లుప్తంగా

భూ ఆక్రమణపై ఫిర్యాదు

పీలేరు : తప్పుడు రికార్డులు సృష్టించి తమ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని పట్టణానికి సురేష్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం మేరకు వివరాలిలావున్నాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీలో సమీపంలో సర్వే నెంబరు 1130/15లో సురేష్ 1.81 ఎకరాలు భూమిని 2012లో కొనుగోలు చేశాడు. ఇప్పటి నుంచి ఇతరులు ఈ భూమి తమదంటూ రావడంతో 2013లో కోర్టుకు వెళ్లడంతో తనకే అనుకూలంగా వచ్చినట్లు సురేష్ తెలిపారు. అయితే శనివారం కొంతమంది తన భూమిని చదును చేయడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తహసీల్దార్ మహబూబ్‌బాషా రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటరత్నం

వాల్మీకిపురం : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎంఈవో వెంకటరత్నం అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎండీఎం కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా చేయాలన్నారు. వంట పాత్రలు, వంట గది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం వంటల పోటీలను నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో 2 వెంకటలక్ష్మి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బషీర్ అహ్మద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పీలేరు పట్టణం జెండామాను వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎల్.ఎ. బషీర్‌అహ్మద్ (73) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం పీలేరుకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, మైనారిటీ కమీషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నాయకులు షఫీ, హబీబ్‌బాషా, హుమయూన్, కంభం భాస్కర్‌రెడ్డి, ఆనంద్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.


రేపు ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

పీలేరు : స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఉన్నత విద్యపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అనంతరం తీసుకోవాల్సిన కోర్సులు, ఉద్యోగావకాశాలపై వివిధ కంపెనీల ప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే జరిమానా

పెద్దతిప్పసముద్రం : మైనర్లు వాహనాలు నడిపి పోలీసుల తనిఖీలో పట్టుబడితే రూ.25 వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎస్‌ఐ రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ఇకనైనా జాగ్రత పడి మైనర్లకు వహనాలు ఇవ్వకుండా జాగ్రత వహించాలని లేని పక్షంలో కొత్త వాహన చట్టం నిబంధనల మేరకు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రహదారి, ట్రాఫిక్ నియమ, నిభంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ జీవో జారీ అయి ప్రస్తుతం ఈ చట్టం అమల్లో కూడా ఉందని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే రూ.10 వేల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. అంతేగాక సీటు బెల్ట్ లేకున్నా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా జరిమానా తప్పదని ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్రీడాదుస్తులు వితరణ



క్రీడాకారులతో దాతలు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపునకు హాజరవుతున్న క్రీడాకారులకు దాతల సహకారంతో క్రీడాదుస్తులను శనివారం వితరణ చేశారు. దాతలు బీబీజే ట్రావెల్స్ బాషా, నిజాం టెక్స్‌టైల్ జబీర్, ఇండియన్ ఆయిల్ నాషిర్ స్టాంపు రైటర్ మస్తాన్, ఆర్‌ఎంపీ డాక్టర్ మున్నాలు క్రీడాకారులకు ఆకర్షణీయమైన దుస్తులు అందజేశారు. క్యాంపు నిర్వహిస్తున్న కోచ్ మహ్మద్‌యూనస్‌ను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు



మదనపల్లె : ఫలరాజు అలంకారంలో వరాల ఆంజన్న



వాల్మీకిపురం: విశేష అలంకరణలో ఆంజనేయస్వామి



గుర్రంకొండ: ప్రత్యేక అలంకరణలో హనుమాన్ ప్రతిమ



తంబళ్లపల్లె : పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి



వాల్మీకిపురం : పట్టాభిరామాలయంలో ఎమ్మెల్యే చింతల



మదనపల్లె : వరాల ఆంజనేయస్వామి సేవలో ఆర్డీవో హరిప్రసాద్



పీలేరు : అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

మదనపల్లె సిటీ : హనుమజ్జయంతి పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై శ్రీరాం... జై జై ఆంజనేయ అంటూ నామస్మరణలో పులకించాయి. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష అభిషేకం నిర్వహించారు. మామిడి పండ్లతో స్వామి ఫలరాజు అలంకారంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లకు పుష్పాభిషేకం జరిగింది. ఆర్డీవో హరిప్రసాద్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక చౌడేశ్వరి సర్కిల్,కాట్లాటపల్లె రోడ్డు మారుతినగర్‌లో హనుమజ్జయంతి తిరుణాల వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసంతర్పణ జరిగింది.స్థానిక పుంగనూరు రోడ్డు నక్కలకుంటలో వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, దివ్యదర్శనం, మహామంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహానికి విశేష పుష్పాలంకరణ చేశారు. మంగళ వాయిద్యాలు, చెక్కభజనలతో పురవీధుల్లో ఊరేగించారు. అఖిల భారత రెడ్డి సంఘ అధ్యక్షులు వరదారెడ్డి నారదరెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై స్వామి ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక అప్పారావు వీధిలోని ఘటికాచల ఆంజనేయస్వామి ఆలయం, మేదరవీధిలోని పిండాల ఆంజనేయస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయంలోని హనుమంతుడు, క్రిష్ణానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వడమాలలు, తమలపాకులతో అలంకరణ చేసి పూజలు చేశారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పీలేరు రూరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక యర్రమరెడ్డి గుట్టలోని శ్రీ అభయహస్త ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం , వడపూజ, ఆకుపూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎ.టి.సుజాత ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక సదుం మార్గంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోనూ హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అశోక్‌కుమార్, రాజుస్వామి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : మండలంలోని మంచూరులో కొలువైన శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కస్తూరిపూజ, ఆకుపూజ, వడమాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీరాంజనేయస్వామి దేవాలయం, నాలుగు రోడ్ల కూడలిలోని ఆంజనేయస్వామి, జమ్మళ్లపల్లె, దండువారిపల్లె, పాతకోటపల్లెల్లో హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ వీరాంజనేయ స్వామి వారికి జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆకు పూజ, వడమాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పడమర ధర్మపథంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి సమూహ దేవాలయం, పొలతల కోనలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రాత్రి 7గంటలకు పుష్పపల్లకిలో శ్రీ వీరాంజనేయస్వామివారికి అధిరోహింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే స్థానిక కొత్తపేటవీధిలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమజయంతి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, ఎగువ అమిలేపల్లె, మామిళ్లవారిపల్లె, టి. పసలవాండ్లపల్లె, తరిగొండ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లోని స్వామి వారి ఆలయాల్లో వేకువజామునే స్వామివారికి పలురకాల నైవేద్యాలు సమర్పించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, వడలతో అలంకరించి మాలలు వేశారు. పలుచోట్ల తమలపాకులతో ఆకుపూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ, ఉమ్మన్నస్వామి, జీవన్‌లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లె బస్టాండులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం మరిమిరెడ్డిగారిపల్లె, కొత్త కురవపల్లె గ్రామస్తులు హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేదపండితులు కుమారస్వామి ఉదయమే స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కలకడలో..

కలకడ : మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆకు పూజలు చేసి పంచాంమృతాలతో అభిషేకం చేశారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ బీసీ కాలనీలో వెలసిన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిత్య అన్నదానంతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, హనుమాన్ కీర్తనలు ఆలపించారు. ఎర్రకోటపల్లె పంచాయతీలోని కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో, నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, పూజలు చేశారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండల పరిధిలోని నిమ్మనపల్లి, పెద్దమాదిగ పల్లె, దిగువపల్లె, అక్కగార్ల కుంట (కేశవరెడ్డి స్కూల్ వద్ద) హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా నిమ్మనపల్లెలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి విశేష విద్యుత్ దీపాలంకరణ చేశారు. స్వామివారికి ఉదయం అంకురార్పణ, పుణ్యవచనం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, పుష్పాభిషేకం, హోమాలు నిర్వహించారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ భద్రాద్రి సీతారాముల కళ్యాణం, లంకా దహనం, లడ్డూ వేలం పాట, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్‌రావు

కలికిరి : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఏలాంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ డీఎస్పీ మోహన్ రావు హెచ్చరించారు. శనివారం సాయంత్రం కలికిరి పోలీస్ స్టేషన్‌లో వివిధ పార్టీల రాజకీయ నేతలతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళి, అల్లర్లుకు పాల్పడితే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో భాగంగా 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని, మంగళవారం కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీల నేతలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు రాకూడదని, కేవలం కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఒక చోట నలుగురికన్నా ఎక్కువ మంది ఒక చోట ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. నియమాలను అధిగమించిన వారు అనవసరంగా కేసులలో ఇరుక్కోవడంతో పాటు కఠినంగా శిక్షార్హులవుతారని, ఇది ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా, ఓడినా ఆ పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. బాణాసంచా కాల్చడం, ఊరేగింపులు నిషేధమన్నారు. ఇప్పటికే అల్లర్లు సృష్టిస్తారన్న అనుమానితులను బైండోవర్ చేయడంతో పాటు మరి కొందరిని జిల్లా బహిష్కరణ చేసినట్లు ఆయన వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఆర్.మోహన్, ఎస్ఐ దేవకుమార్, రాజకీయ పార్టీల నేతలు రమేష్‌కుమార్‌రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎస్టీడి హరి, సతీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రిజ్వానుల్లా, ప్రదీప్‌రెడ్డి, వెంటపతి, రఘు, శివాజీ, ఆనందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జనార్ధన్ గౌడ్, రమణారెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కేన్సర్ నివారణ సాధ్యం



కేన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో వైద్యులు

మదనపల్లె : ప్రాథమిక దశలో సరైన వైద్య పరీక్షల ద్వారా కేన్సర్ వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ జమున, సూపరింటెండెంట్ ఎం.ఎస్. రాజు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కేన్సర్ స్క్రీనింగ్ పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హోమిబాబా కేన్సర్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందిన ఎస్వీ. మెడికల్ కాలేజి వైద్యబృందం స్థానిక జిల్లా ఆసుపత్రిలోని వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సెర్వైకల్, బ్రెస్ట్(రొమ్ము), నోటి కేన్సర్ గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి ప్రపంచ మహమ్మారిగా మారిందన్నారు. అనేకమంది ఈ వ్యాధి కారణంగా సరైన చికిత్సలు తీసుకోకుండా మృత్యువాత పడుతున్నారన్నారు. వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి, సరైన పరీక్షల ద్వారా నిర్ధారించగలిగితే, మెరుగైన చికిత్స ద్వారా కేన్సర్ ను జయించవచ్చన్నారు. కేన్సర్ నివారణలో స్క్రీనింగ్ పరీక్షలు చాలా కీలకమన్నారు. సకాలంలో గుర్తించగలిగే 70 శాతం కేసులు నివారించవచ్చని అన్నారు. అంతేకాకుండా మరణాల రేటును తగ్గించవచ్చున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వైద్యులు జిల్లాలోని పీహెచ్‌సీ సెంటర్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లకు ఈనెల 5–7 తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలి దేవి, నోడల్ ఆఫీసర్లు వెంకటలక్ష్మి, సౌమ్యపల్లవి, వైద్యులు రోజారమణి, ఇంద్రాణి, శ్రీనివాస్, సునీత, సోనియా, చండిప్రియ,తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో పారిశుధ్య పనులు చేస్తున్న స్వీపర్లను అసభ్య పదజాలంతో దూషించిన బస్టాండు మేనేజర్ రమణపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు శనివారం డీఎం వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ స్వీపర్లను ప్రయాణికుల ఎదుటే అసభ్యంగా దూషించడమే కాకుండా చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా రమణ ప్రవర్తపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మురళి, ముబారక్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లగంగమ్మ తిరునాల

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీ నల్లగంగమ్మ తిరునాల ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఆదివారం రాత్రి చాందినీ బండ్లు ఆలయ ప్రదక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారి బోనాలు చెల్లింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కలకడలో భారీ వర్షం



కలకడ : కలకడలో భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం కురిసిన వర్షం ఈ ఏడాదిలోనే అధిక వర్షపాతం నమోదు చేసినట్లు అయింది. ఉదయం నుంచి అధిక ఎండలు మండుతున్నా సాయంత్రం సమయానికి ప్రారంభమైన వర్షం రాత్రి 8.30 గంటలైనా కురుస్తూనే ఉండటంతో రైతులు ఆనందపడ్డారు. వేడిమి నుంచి ప్రజలు, జంతువులకు వరుణ దేవుడు ఉపశమనం ప్రసాదించినట్లు అయింది. ఉరుములు, మెరుపులు అధికంగా ఉండటంతో విద్యుత్ శాఖ అధికారులు ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

7న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 7న ఊటీ, మైసూర్ ప్రదేశాలకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 7న రాత్రి 9 గటంలకు బయలుదేరి 8న ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. 9న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూర్ వచ్చి అక్కడ పలు ప్రదేశాలు చూసి రాత్రి బయలుదేరి 10న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను, పోను చార్జి రూ.2800 చెల్లించాలన్నారు. సీట్ల కోసం 7382875034, 7382876658,9441646104ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు భరోసా

కేవీపల్లె : దివ్యాంగుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలు భరోసా కల్పిస్తున్నట్లు ఎంఈవోలు రెడ్డిబాషా, డి. సుబ్రమణ్యం అన్నారు. స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ దివ్యాంగ పిల్లలను భవితా కేంద్రాల్లో చేర్పిస్తే పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు లభిస్తాయన్నారు. ప్రతి నెలా రూ. 300 రవాణా భత్యం, వారితోపాటు వచ్చేవారికి ఎస్కార్ట్ అలివేషన్స్ కింద రూ. 300, బాలికలకు ప్రత్యేకంగా ప్రతి నెలా రూ. 200, వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబులు, వైకల్యం ఉన్నవారికి సదరం సర్టిఫికెట్‌పత్రం పంపిణీ తోపాటు స్పీచ్ థెరఫీ, ఫిజియోథెరపీపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భవితా కేంద్రం ఐఈఆర్‌టీ మాధవి పాల్గొన్నారు.

ఘనంగా ధమ్మ పరివర్తన మహోత్సవం

బౌద్ధ బిక్షువులచే ధమ్మ ప్రవచనం



అంకిశెట్టిపల్లె బుద్ధునికొండపై ధమ్మ పరివర్తన మహోత్సవాలకు హాజరైన పట్టణ ప్రజలు

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె బుద్ధుని కొండపై శనివారం ధమ్మ పరివర్తన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తథాగతుడు గౌతమ బుద్ధుని 2568వ జయంతిని పురస్కరించుకొని మదనపల్లె బుద్ధ విహార్, బుద్ధ అంబేడ్కర్ సమాజ్ సంయుక్తంగా మహోత్సవాలను నిర్వహించాయి. బుద్ధ అంబేడ్కర్ సమాజ్ (బాస్) వ్యవస్థాపకుడు, ఉపాసక పీటీఎం. శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మహోత్సవాలకు బెంగళూరులోని మహాబోధి సొసైటీకి చెందిన 20 మంది బౌద్ధ బిక్షువులు హాజరై బుద్ధ పూజ, ధమ్మ ప్రవచనం చేశారు. ఈసందర్భంగా బౌద్ధ బిక్షువు భంతే జ్ఞానానంద మాట్లాడుతూ మనిషి కోర్కెలపై అదుపు కలిగి, నైతిక విలువలతో జీవించి, దుఃఖ రహిత సమాజాన్ని ఆవిష్కరించేందుకు ఉపయుక్తంగా ఉండే ఉన్నతమైన జీవన మార్గాన్ని తథాగతుడు గౌతమ బుద్ధుడు కనుగొన్నాడని, ఆ మార్గాన్నే బౌద్ధ ధమ్మంగా నేడు ప్రపంచమంతటా ఆచరిస్తున్నారని సవివరంగా తెలియజేశారు. ఆధునిక సమాజంలో ఎక్కువ మందిలో నైతిక విలువలు ధ్వంసమై, వారంతా హింసా ప్రవృత్తి వైపు వేగంగా కదులుతున్నారని, శీలభ్రష్టులై మానవత్వాన్ని మంటగలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సమాజంలో మనిషి ఆధునికంగా నాగరిక జీవనం చేయడానికి బౌద్ధ జీవన విధానాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు.

విద్యుద్దీపాలతో బుద్ధునికొండ :

ధమ్మ పరివర్తన మహోత్సవాల కోసం ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలతో బుద్ధునికొండ దేదీప్యమానంగా ప్రకాశించింది. తథాగతుడు గౌతమ బుద్ధుని విగ్రహాలను, బోధి వృక్షమును వివిధ రకాల పుష్పములతో అలంకరించి పూజించారు. బిక్షువులు, ఉపాసకులు త్రిశరణ, పంచశీల పఠించి, సమ్యాసం బుద్ధున్ని శరణు వేడుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో మోసుకుంటూ కొండపై తథాగతుని ప్రతిమను ఊరేగించారు. ఉపాసకుల సమావేశానికి బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బి.ఎస్.ఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, దళిత సంఘర్షణ సమితి కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ఐ.ఆర్.ఎస్ అధికారిణి గౌతమి తదితరులు హాజరయ్యారు. ప్రజలకు చేరువ చేసే మార్గాన్ని దిశానిర్దేశం చేశారు.

గడువుదాటిన రాగిపిండి ఇవ్వరాదు



కోన పంచాయతీలో నిత్యవససరుకులు అందజేస్తున్న దృశ్యం

కలకడ : మండలంలోని కార్డు దారులకు ప్రభుత్వం సరఫరా చేసిన రాగిపిండి గడువు దాటివుంటే కార్డుదారులకు ఇవ్వరాదని సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ కృపావతి తెలిపారు. మండలంలోని 31 చౌకదుకాణ డీలర్ల వద్ద బియ్యం, చక్కర, జొన్నలు అందుబాటులో ఉన్నాయని, ఎవరివద్ద అయినా రాగిపిండి నిల్వ ఉన్నా మూడు నెలల గడువు పూర్తికావడంతో అలాంటి రాగి పిండిని పంచరాదన్నారు. జొన్నలు శుద్ధగా ఉన్నాయని, కార్డుదారులు కోరిన మేరకు ఒక కార్డుకు 3కిలోల మేరకు బియ్యం తగ్గించి ఉచితంగా తీసుకునే వెలుసుబాటు ప్రభుత్వం కల్పించిందని గుర్తు చేశారు. ఏడుగురు యండియూ ఆపరేటర్ల పరిధిలో మొదటిరోజు కేవలం 586 మందికార్డు దారులకు మాత్రమే నిత్యవసర సరుకులు అందజేశారని తెలిపారు. వృద్ధులకు ఈనెల కూడా పింఛన్ కష్టాలు తీరలేదు. బ్యాంకులు, తపాలశాఖ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద క్యూ కట్టారు.